RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 349 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 21 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# నేడే కేబినెట్ భేటీ!

## 'రుణ మాఫీ' విధివిధానాలపై చర్చ




## అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తేదీ ఖరారు

హైదరాబాద్ : ఈ నెల 21న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని సచివాలయంలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానంగా అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు, ఆగస్టు 15 నాటికి అమలు చేయబోయే పంట రుణాల మాఫీ పథకంపై చర్చించనున్నారు. రుణ మాఫీ పథకం అమలుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అవసరమైన నిధులను సేకరణపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, విధి విధానాలను కూడా ఖరారు చేయబోతోంది. పథకానికి ఎప్పటి నుంచి కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించాలి, ఇంకా ఎలాంటి నిబంధనలు విధించాలన్నదానిపై కసరత్తు చేస్తోంది. దీనిపై క్యాబినెట్ భేటీలో కూలంకషంగా చర్చించి, మంత్రుల అభిప్రాయాలను కూడా తెలుసుకోనుంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున ప్రారంభ తేదీని ఖరారు చేయనుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరిలో జరిగాయి. వీటితో పాటు ఇతర అంశాలు చర్చకు రానున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో రుణమాఫీ చేయాలన్న టార్గెట్ పెట్టుకున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యచరణ వేగవంతం చేసింది. ఓవైపు నిధుల సమీకరణ చేస్తూనే... మరోవైపు అర్హులను తేల్చే పనిలో పడింది. ఇప్పటికే దీనిపై అధికారులు ఓ కార్యచరణ సిద్ధం చేశారని తెలుస్తోంది. వీటిపై నిర్ణయం తీసుకునేందుకు 21 రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కానుంది. 21న జరిగే తెలంగాణ మంత్రిమండలి భేటీలో ముఖ్య అంశంగా రుణమాఫీ ఉంటుందని అంటున్నారు. ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చించి కీలకమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఎవరెవరికి రుణమాఫీ చేయాలి, నిధుల సమీకరణకు ఏం చేయాలనే విషయంపై కూలంకుశంగా చర్చించనున్నారు. జులై17 రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. జులై నుంచే వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయని అప్పటి నుంచి రుణాలు మాఫీ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారట. జులై మధ్యలో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి.. ఆగస్టు 15 కల్లా పూర్తి చేయనున్నారు. పీఎం కిసాన్ పథకంలో ఉన్న రూల్స్ ప్రకారమే మొత్తం మూడు విడతల్లో అప్పులు తీర్చేయనున్నారని టాక్. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ప్రజాప్రతినిధులు, ఐటీ కడుతున్న వాళ్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించడం లేదు. ఇప్పుడు రుణమాఫీ కూడా వారి వచ్చే ఛాన్స్ లేదంటున్నారు.

# ప్రధాని మోదీని కలుస్తాం..

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క షాకింగ్ కామెంట్స్

ఖమ్మం జిల్లా: తెలంగాణ ప్రాంతానికి ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి..ఈ సంస్థ తెలంగాణకు తలమానికమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయిపోతే ఆ ప్రాంతంలో ఉన్న వేలాది మంది ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్థ కోసం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనీ కలుస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధానిని కలుస్తామని తెలిపారు. తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తాం, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసం తాము ఈ పని చేస్తామని తెలిపారు. ఇవన్నీ రాష్ట్ర ప్రయోజనాల కోసం చేస్తున్నావేనని అన్నారు. తమకు మద్దతు తెలిపిన సీపీఐ, మిగతా రాజకీయ పార్టీలను కలుపుకుని మోదీ దగ్గరకు వెళ్తామని వివరించారు.

ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు(గురువారం) మల్లు భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరానికి సంబంధించి, రాష్ట్ర, దేశ ప్రజలకు తెలియాలని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల అవసరాలు గురించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం ఆక్షన్ మొదలు పెడుతుందని చెప్పారు. రేపు హైదరాబాద్ నగరంలో ఆక్షన్ జరగబోతుందని తెలిపారు.

**బొగ్గు ఉత్పత్తి పడిపోతుంది :** "బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు రాష్ట్రాన్ని పాలించింది. తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం మాటలు ఉన్నాయి. దాదాపు నలభై రెండు వేల మంది ఉద్యోగస్తులు నేరుగా సింగరేణిలో పని చేస్తున్నారు, 26 వేల మంది ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇన్ని వేల మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థ గురించి రాష్ట్ర ప్రజలకు తెలియాల్సి ఉంది. 40 బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026 కి పూర్తిగా పడిపోతుంది. బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2031, 32 వరకు నిలబెట్టుకోవాలన్న సింగరేణి కొత్త బొగ్గు గనులను సంపాదించుకోవాలి.

లేదా సింగరేణి అనేది చరిత్ర లా నిలిచిపోతుంది. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి, నేరుగా జీ 2 జీ చేయాలి. కేంద్రంలో ఉన్న బీజేపీ 1957 చట్టం ప్రకారం సవరణ తీసుకుని వచ్చి దేశంలో ఉన్న బొగ్గు గనులు అన్నింటినీ ఆక్షన్ ద్వారా నిర్వహించే విధానాన్ని తీసుకొచ్చింది.తెలంగాణ ప్రయోజనాల గురించి బీఆర్ఎస్ మాట్లాడటం సరికాదు" అని మల్లు భట్టి విక్రమార్క అన్నారు.




**ఆ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు :** "కేంద్ర ప్రభుత్వం పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ ఇప్పుడు మేము పదేళ్లు సింగరేణిని కాపాడమని మాట్లాడుతున్నారు. 2021 అక్టోబర్ 29వ తేదీన ఒక సమావేశం ఏర్పాటు చేశారు. నవంబర్ 5 న గత సీఎం కేసీఆర్ ఒక కోర్ కమిటీ నిర్వహించారు. కేసీఆర్ గోదావరి ప్రాంతాల గనులు తీసుకోకూడదని ఆదేశాలు జారీ చేశారు. రెండు కంపెనీలు బీఆర్ఎస్ పార్టీకి దగ్గరి వాళ్లవి కాబట్టి సింగరేణికి కాకుండా వాళ్లకు ఇచ్చేశారు. ఒరిస్సాలో బల్క్ ఈ బ్లాక్ అని ఉంది. దాని ఒక్కదానికి బిడ్ వేయాలని ప్రయత్నం చేశారు. ఇప్పుడు కూడా తెలంగాణ మీద ప్రేమ ఉన్నట్లు బీజేపీ మంత్రులు మాట్లాడుతున్నారు. తెలంగాణలో తలమానికంగా ఉన్న ఈ శాఖ మీ దగ్గరకు వచ్చింది. సింగరేణి తరఫున రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలుస్తాం.రాష్ట్రంలో నిజంగా సమయం తీసుకుని ప్రధానిని, కిషన్ రెడ్డిని అందరం కలిసి కలుద్దాం. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా 0.5 పర్సంట్ చూపించి కేంద్ర ప్రభుత్వాన్ని కోరతాం.

ఆ రెండు బ్లాక్‌లు కూడ మేము అడుగుతాం ఆ రెండు సంస్థల సమయం కూడా మించి పోయింది కాబట్టి వాటిని ఇతర కంపెనీలకు ఆక్షన్ పెట్టకుండా అడుగుతాం. ఎవరో వ్యక్తి అంటున్నాడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పని చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ కానీ ఇంకా ఎవరైనా మాట్లాడటానికి, చర్చకు కాగితాలతో రావాలి" అని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## టీడీపీ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపగలిగింది

హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని ఖతం చేసే ప్రయత్నం చేస్తున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో టీడీపీ పార్టీకి 16ఎంపీ సీట్లు వచ్చాయని.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపగలిగిందని అన్నారు. 8 స్థానాలు గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ అస్తిత్వానికి శ్రీరామ రక్ష అని మాటిచ్చారు. ఉద్దేశ పూర్వకంగా సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించడం లేదని చెప్పారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి బొగ్గు గనుల యాక్షన్‌ను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. 16ఎంపీల పవర్ ఏంటో ఏపీని చూస్తే తెలుస్తుందని ఉద్ఘాటించారు.



రేవంత్ ఎందుకు ఆపడం లేదు. కేసుల భయమా? అని ఎద్దేవా చేశారు. అందుకే 16ఎంపీలు గెలిపించాలని ప్రజలను కోరామన్నారు. సింగరేణి మెడ మీద కేంద్రం కత్తి పెడితే సీఎం రేవంత్ ఆ కత్తికి సాన పడుతున్నారని సెటైర్లు విసిరారు. సింగరేణికి ప్రమాదం వస్తే కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. సింగరేణిని కార్పొరేట్ గద్దలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నిర్ణయాన్ని అడ్డుకుంటామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆలోచించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒరిస్సా, గుజరాత్‌లో ప్రభుత్వ సంస్థలకు ఇచ్చి ఇక్కడ సింగరేణికి బొగ్గు బ్లాక్స్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సింగరేణి వేలంలో ఎందుకు పాల్గొనాలని నిలదీశారు. ఇక్కడ ఉన్న ఎంపీలు చేత కానివారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.




# నిరుద్యోగులకు శుభవార్త!

# ఇక ఉద్యోగాల జాతరే!!

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రాష్ట్ర సర్కారు ప్లాన్ చేస్తున్నది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్స్‌కు అనుగుణంగా వాటికి కొత్త పోస్టులు చేర్చి, మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చే విధంగా ఆలోచన చేస్తున్నది.

ఇందులో భాగంగానే గ్రూప్ –1 లో పోస్టుల సంఖ్యను కూడా పెంచింది. ఇప్పుడు పోలీసు, టీచర్, గురుకుల, వివిధ పోస్టుల భర్తీతోపాటు ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్– 2, 3,4 కు సంబంధించి జాబ్ క్యాలెండర్ రూపకల్పన చేస్తున్నది. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వీఆర్ఏ, వీఆర్ఓ పోస్టులను తీసేయడంతో వాటి స్థానంలో కొత్త పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో రెవెన్యూ విషయంలో గ్రామానికి ఒక అధికారి ఉండేలా మరిన్ని పోస్టులను కొత్త ప్రభుత్వం క్రియేట్ చేయాలనుకుంటున్నది. ఏటేటా రిటైర్మెంట్ అవుతున్న కొద్దీ.. వెంటనే అవసరాల మేరకు ప్రమోషన్లు ఇస్తూ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌పోస్టుల భర్తీకి చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇక అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ 30 వేలకు పైగా మందికి ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాలను అందించింది.

మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు పరిధిలో 6,956 స్టాఫ్‌నర్స్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధ్వర్యంలో 14,099 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసింది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు ఎంపికైన 7,800 మంది టీచర్లు, లెక్చరర్లకు నియామక పత్రాలను అందించింది. టీజీపీఎస్సీ అధ్వర్యంలో చేపట్టిన రిక్రూట్‌మెంట్ ద్వారా 87 పోస్టులను భర్తీ చేసింది. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేని విధంగా మెగా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేసింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## 50 లక్షల మంది భారతీయుల ప్రభావానికి ఆ దేశం ఫిదా!

అగ్రరాజ్యం అమెరికాలో 5 మిలియన్ల (50 లక్షలు) మంది భారతీయులు నివసిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం, ఉన్నత ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన భారతీయులు అక్కడే స్థిరపడి శాశ్వత నివాస హోదాను అందుకున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో ఐదు మిలియన్ల మంది భారతీయుల జనాభా అమెరికా మొత్తం జనాభాలో 1.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ అమెరికాలో ఉన్న 33 కోట్ల మందిపై విశేష ప్రభావం చూపుతున్నారు. అమెరికన్లను అనేక కోణాల్లో భారతీయులు గణనీయంగా ప్రభావితం చేస్తున్నారు. అంతేకాకుండా అమెరికాలో నివసిస్తున్న వలస సమూహాల్లో అత్యంత శక్తివంతమైన వలస సమూహాలుగా భారతీయులు నిలుస్తున్నారు. ఈ మేరకు నివేదిక ఒకటి ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికాలోని భారతీయులు వ్యాపారం, విద్యారంగం, సంస్కృతి, ప్రజా సేవలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నారని పేర్కొంది. వ్యాపార రంగంలో.. గూగుల్, వెర్టెక్స్ ఫార్మాస్యూటికల్స్ వంటి 16 ఫార్చ్యూన్ 500 కంపెనీలకు భారతీయ – అమెరికన్లు నాయకత్వం వహిస్తున్నారు. వీరు సమిష్టిగా 2.7 మిలియన్ల మంది అమెరికన్లకు ఉపాధిని కల్పిస్తుండటం విశేషం. అంతేకాకుండా దాదాపు ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. అలాగే భారతీయులు స్టార్టప్స్ లో తమ సత్తా చాటుతున్నారు. 648 యూనికార్న్ లకు సంబంధించి 72 యూనికార్న్ లకు భారతీయులే సహ వ్యవస్థాపకులుగా ఉన్నారు. వీటిలో కేంబ్రిడ్జ్ మొబైల్ టెలిమాటిక్స్, సోలుజెన్ వంటివి ఉన్నాయి. ఈ స్టార్టప్‌లు 55,000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉన్నాయి. వాటి మొత్తం విలువ 195 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. హోటళ్ల రంగంలోనూ భారతీయులు సత్తా చాటుతున్నారు. అమెరికాలో హోటళ్ల రంగంలో మెజారిటీ భారతీయులే ఉన్నారు. వీరు పెద్ద ఎత్తున పన్ను చెల్లిస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదం చేస్తున్నారు. హోటళ్ల రంగంలో భారతీయ అమెరికన్లు సంవత్సరానికి 250 - 300 బిలియన్ డాలర్లు పన్ను కింద చెల్లిస్తున్నారు. భారతీయ అమెరికన్ల హోటల్ వ్యాపారాలు పరోక్షంగా 11 మిలియన్లకు పైగా అమెరికన్లకు ఉద్యోగాలను అందించాయి. ఇక విద్యారంగం, ఆవిష్కరణలు, వాటికి పేటెంట్లు పొందడంలోనూ భారతీయ – అమెరికన్లు విశేషమైన వాటాను కలిగి ఉన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ గ్రాంట్లలో గణనీయమైన భాగాన్ని అందుకుంటున్నారు. ముఖ్యంగా నవీన్ వరదరాజన్, సుబ్ర సురేష్ వంటి వ్యక్తులు ఆరోగ్య సంరక్షణ, సుస్థిరత వంటి రంగాలలో మంచి పురోగతిని సాధించారు. సాంస్కృతికంగానూ భారతీయ – అమెరికన్లు వంటకాలు, యోగా, ధ్యానం, పండుగలు, ఫ్యాషన్, సాహిత్యం, దాతృత్వం వంటి వాటి ద్వారా అమెరికన్ల జీవితాన్ని సుసంపన్నం చేస్తున్నారు. దీపక్ చోప్రా, వికాస్ ఖన్నా వంటి వారి ఆయుర్వేదం, భారతీయ వంటకాలు ప్రాచుర్యం పొందాయి. సాహిత్యంలో జుంపా లాహిరి వంటి రచయితలు తమ సాహిత్యం ద్వారా లబ్ధప్రతిష్టలయ్యారు. రాజకీయాల్లోనూ భారతీయ అమెరికన్లు సత్తా చాటుతున్నారు. అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ తో సహా ఫెడరల్ అడ్మినిస్ట్రేషన్‌లో అనేక కీలక పదవుల్లో భారతీయులు ఉన్నారు. అలాగే భారతీయ సినిమాలను, హీరోలు, దర్శకులు, హీరోయిన్లను అమెరికన్లు పెద్ద ఎత్తున ఇష్టపడుతున్నారు. భారతీయ సినిమాలను అమెరికాలో పెద్ద ఎత్తున ప్రదర్శిస్తున్నారు. ఇలా అమెరికాలో నివసిస్తున్న 5 మిలియన్ల మంది భారతీయులు 33 కోట్ల మంది అమెరికన్లపై విశేష ప్రభావం చూపుతున్నారు.

## రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుపై అధ్యయనం




సిరిసిల్ల : ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చడంలో కీలకమైంది స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ. దీని ద్వారా రాబడులు పెంచుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల ఫీజు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సబ్ రిజిస్ట్రార్ల వద్ద ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా ఆయా మండల కేంద్రాలు, పంచాయతీలు, పురపాలికల్లో వాస్తవంగా ఎంత ధర పలుకుతుందనే విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో ఇంటి మార్కెట్ ధరలు ఎలా ఉన్నాయి, ఇంటి నంబర్లతో సహా వివరాలు సేకరిస్తున్నారు. వీటన్నింటిపై ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్‌లో సబ్ రిజిస్ట్రార్లు అందరికీ జోనల్ స్థాయి సమీక్ష సమావేశం జరుగుతుంది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల పైన ప్రభుత్వానికి పంపాల్సిన వివరాలు, అలాగే ధరల నిర్ణయంపై అభ్యంతరాల స్వీకరణపైన చర్చించనున్నారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తయ్యాక ఆగస్టు 1 నుంచి పెంచిన ధరలు అమలులోకి వస్తాయి.

### ఇదీ పరిస్థితి

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.50 కోట్ల మేరకు ఆదాయం వస్తోంది. పెరగనున్న ఛార్జీలతో రాబడి కూడా పెరుగుతుంది. 2021 వరకు మార్కెట్ విలువపై రిజిస్ట్రేషన్ ఫీజు 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచారు. వ్యవసాయ భూములకు ఎకరానికి కనీస ధర రూ.75 వేలు, ఖాళీ స్థలాలకు చదరపు గజం చొప్పున, నివాసాలకు చదరపు అడుగు చొప్పున కనీస ధర నిర్ణయించి మార్కెట్ విలువ పెంచారు. ప్రస్తుతం సిరిసిల్ల, వేములవాడ పురపాలికల పరిధిలో ప్లాట్లు చదరపు గజం కనిష్ఠంగా రూ.1,780 నుంచి రూ.2,500 వరకు ఉంది. అదే గ్రామీణ ప్రాంతాల్లో గజం రూ.800 నుంచి రూ.3,000 వరకు ఉంది.

సిరిసిల్ల రెండో బాహ్యవలయ రహదారి చంద్రంపేట, రగుడు ప్రాంతంలో చదరపు గజం మార్కెట్ విలువ రూ.2 వేలు ఉంది. ఇక్కడ వంద గజాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ.2లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలి. కాగా బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం చదరపు గజం 20 వేలు. అంటే వంద గజాలకు రూ.20 లక్షల వరకు పలుకుతుంది. ఇలా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని ప్రభుత్వ మార్కెట్ విలువ, స్థానికంగా జరుగుతున్న క్రయ, విక్రయాల ధరలపైనాపూర్తిగా అధ్యయనం చేయనున్నారు. పురపాలికల్లోని స్థిరాస్తి ప్రభావం గ్రామాల్లోని వ్యవసాయ భూములకు పాకింది. దాంతో తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో రియల్ వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది.

### వ్యవసాయ భూముల విక్రయాలపై దృష్టి

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నెలకు సగటున వెయ్యి నుంచి 1,300 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతాయి. వీటి ద్వారా సుమారు రూ.4.50 కోట్ల ఆదాయం వస్తోంది. అలాగే ఒక్కో తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీనిలో వీర్నపల్లి, రుద్రంగి మండలాల్లో తక్కువగా ఉంటాయి. ఎల్లారెడ్డిపేట, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో ఎక్కువ. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలాల్లో లేఅవుట్లు లేకుండానే గుంట, రెండు గుంటల చొప్పున వ్యవసాయ భూములను విక్రయిస్తున్నారు. దీనివల్ల చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి రాబడి పడిపోతుందన్న అభిప్రాయం ఉంది. భవిష్యత్తులో నివాస స్థలంగా మార్చుకోవాలనుకునేవారు వ్యవసాయ భూములు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు విక్రయదారులు లేఅవుట్ లేకుండా, వ్యవసాయేతర భూమిగా మార్పిడి పన్ను (నాలా) చెల్లించకుండా విక్రయిస్తున్నారు. ఇలాంటి లావాదేవీల నుంచి రాబడి పెంచుకోవాలన్న ఆలోచనలో రిజిస్ట్రేషన్ శాఖ ఉంది. కాగా ప్రభుత్వం సేకరించే వివరాల్లో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ విలువ ఎంత? ప్రస్తుత ప్రభుత్వ విలువ ఎంత? అనే కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నారు.

## కేటాయించని నిధులు.. పూర్తికాని పనులు



బోయినపల్లి : వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు రాజన్న సిరిసిల్ల–కరీంనగర్ జిల్లాల ప్రధాన రహదారిలో కొదురుపాక నుంచి నర్సింగాపూర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపట్టారు. పలు చోట్ల రహదారి ఎత్తు బాగా పెరిగింది. మట్టి కొట్టుకుపోకుండా రాతి కట్టు (బండరాళ్లు పేర్చడం), రెయిలింగ్ పనులు చేపట్టాల్సి ఉన్నా విస్మరించారు. చిరు వర్షాలకే రహదారి అంచులు కోతకు గురవుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల– కరీంనగర్ ప్రధాన రహదారిలో వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు కొదురుపాక చౌరస్తా నుంచి నర్సింగాపూర్ స్టేజి వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం గతంలోనే నిధులు విడుదల చేసింది. కొదురుపాక చౌరస్తా నుంచి వెంకట్రావుపల్లి శివారులోని మధ్యమానేరు ఎడమ కాలువ వరకు ఒక భాగం, అక్కడి నుంచి నర్సింగాపూర్ వరకు మరో భాగంగా పనులు చేపట్టారు. రహదారి నిర్మాణం కోసం రూ. 20.45 కోట్లు కేటాయించారు. కొదురుపాక నుంచి నర్సింగాపూర్ స్టేజి వరకు పూర్తి చేశారు. వెంకట్రావుపల్లి శివారులోని మధ్యమానేరు ఎడమ కాలువ వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వెంకట్రావుపల్లి వద్ద డివైడర్ పనులు పూర్తి కావాల్సి ఉంది. రహదారి నిర్మాణంతో వాహనదారులకు మెరుగైన రవాణా సదుపాయం ఏర్పడింది.

### బండరాళ్లు పేర్చకపోవడంతో...

కొదురుపాక చౌరస్తా నుంచి నర్సింగాపూర్ వరకు చేపట్టిన నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో పలు చోట్ల రహదారి ఎత్తు అధికంగా ఉంది. రహదారి ఎత్తుగా ఉన్న చోట మట్టి కోతకు గురికాకుండా ఉండటానికి రాతి కట్టు (బండరాళ్లు పేర్చడం) చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు రెయిలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి మట్టి కోతకు గురైంది. అందులో విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. మట్టి కోతకు గురవడం వల్ల తారు రోడ్డు కూడా క్రమంగా కోతకు గురై కొట్టుకుపోయే అవకాశం ఉంది. వీటితోపాటు రహదారి డివైడర్ మధ్యలో లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. రాత్రి సమయంలో వాహనాల లైట్లు ఎదురెదురుగా పడకుండా ఉండటానికి మధ్యలో మొక్కలు నాటాల్సి ఉంది. మధ్యలో ఎర్ర మట్టి పోయలేదు. మిగతా పనుల పూర్తికి సుమారు రూ.80 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు సమాచారం.

### ప్రమాదాలకు ఆస్కారం

నాలుగు వరుసల రహదారి ఎత్తుగా ఉన్న చోట బండరాళ్లు పేర్చకపోవడం వల్ల వర్షాలకు మట్టి కోతకు గురైంది. భారీ వర్షాలు పడితే మట్టి పూర్తిగా కోతకు గురై తారు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. త్వరగా బండరాళ్లు పేర్చడంతోపాటు రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. డివైడర్ల మధ్యలో లైటింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలి. – సతీశ్, కొదురుపాక

### ప్రతిపాదనలు పంపిస్తాం

నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యమానేరు ఎడమ కాలువ వద్ద సుమారు రూ.కోటితో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఓవైపు వంతెన నిర్మాణం పూర్తయి రెండోవైపు పనులు చేపడుతున్నారు. రహదారి ఎక్కడైతే ఎత్తుగా ఉందో అక్కడ మట్టి కోతకు గురికాకుండా ఉండేందుకు తెట్టె కట్టడానికి పరిశీలన చేశాం. అంచనాలు రూపొందుతున్నాయి. త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తాం. – సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ

## అత్యవసర బృందాలు ఎక్కడ?

హైదరాబాద్: వానాకాలంలో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా అత్యవసర బృందాలు సిద్ధం చేశామని జలమండలి ఊదరగొడుతుంది. నగరంలో కురిసిన భారీ వాన రోడ్లను ముంచెత్తినా ఈ బృందాలు పత్తా లేవు. మెహిదీపట్నం నుంచి మూసీ వంతెన వరకు అనేక ప్రాంతాల్లో వరద రోడ్లపై పోటెత్తింది. మూసీ వంతెనపై మోకాళ్ల లోతున నిలిచింది. 2 గంటలపైనే ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, బేగంపేట, లక్డీకాపూల్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నుంచి నీరు పొంగి రోడ్లని ముంచేసింది. మ్యాన్‌హోళ్లలోని చెత్తాచెదారాన్ని తొలగించి వరద సాఫీగా వెళ్లేలా ఈ బృందాలు సేవలు అందించాలి. నీరు బయటకు పోని చోట తాత్కాలిక మోటార్లు పెట్టి తోడించాలి. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి 125 నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించింది. మరోవైపు 16 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(ఈఆర్టీ)లు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు సేవలు అందించేలా నియమించింది. 225 ఎయిర్‌టెక్ యంత్రాలనూ సిద్ధం చేసి కొన్ని రాత్రి వేళల్లోనూ అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రకటించింది. ఇదంతా కాగితాలకే పరిమితమైనట్లు నగరంలో పరిస్థితి చూస్తే తేటతెల్లమవుతోంది. పర్యవేక్షణ కొరవడినట్లు వెల్లడైంది. జోరుగా కురిసిన వానకు నిమిషాల వ్యవధిలోనే చాలా ప్రాంతాల్లో రహదారులు కాల్వలను తలపించాయి.

## ప్రకృతి సోయగం ఆస్వాదిస్తే ఆనందం

ఆదిలాబాద్ :ఈ పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో నిలదొక్కుకునేందుకు జనాలు తీవ్ర ఒత్తిడి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అందుకు వారు తమ జీవన శైలిని మార్చుకుంటున్నారు. వారాంతపు సెలవుల్లో మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. మానసికోల్లాసాన్ని పొందుతున్నారు. ప్రపంచ పిక్నిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని పిక్నిక్ పాయింట్లను వివరిస్తూ కథనం.

ప్రయోజనాలు ఇలా.. : పిక్నిక్‌కి వెళ్తే ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఒత్తిడి నుంచి ఉపశమనం ఉంటుంది. మంచి వ్యాయామం అవుతుంది. తాజా గాలి, సూర్యరశ్మి లభిస్తుంది.

### కాలక్షేపానికి 'హరితవనం'

చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ హరితవనం వెళ్లేందుకు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానాన్ని పెంపొందించేలా పక్షులు, వన్య ప్రాణులు, మృగాల బొమ్మలు ఏర్పాటు చేశారు. సాహస క్రీడలు, బోటింగ్, రోప్‌పైన స్కై సైక్లింగ్ వంటి కృత్యాలు వర్షాకాలంలో చేసుకోవచ్చు. అటవీశాఖ నిర్వహణలో ఈ హరితవనం పని చేస్తుంది. ప్రవేశ రుసుము చెల్లించి లోనికి వెళ్లవచ్చు. పిక్నిక్ కోసం బడి పిల్లలు వచ్చి ఆడుకుంటారు. కాలక్షేపంతో గడుపుతుంటారు. ఆదిలాబాద్



నుంచి 7 కి.మీ.ల దూరంలో ఉంది.

వచ్చిందంటే చాలు చాలా మంది ఖండాల ప్రాంతానికి వెళ్తుంటారు. ప్రకృతి ఒడిలో విహరించినట్లు అనుభూతి పొందుతారు. పచ్చని అడవి, చిన్న చిన్న గుట్టల అందాలను చూడాల్సిందే. ఇక్కడ ఉండేందుకు గదులు లేవు. చాలా మంది ఇంటి నుంచే తయారు చేసుకున్న భోజనాలు తీసుకు వెళ్తుంటారు. ఇంకొందరు అక్కడే వంటలు చేసి ప్రకృతి రమణీయతను చూస్తూ వన భోజనాలు చేస్తుంటారు. ఇది ఆదిలాబాద్ గ్రామీణ మండలం నుంచి 40 కి.మీ.లు, ఇంద్రవెల్లి నుంచి 9 కి.మీ.ల దూరంలో ఉంది. మొలలగుట్ట వరకు వాహనాలు వెళ్తాయి. అక్కడి నుంచి 2 కి.మీ.లు కాలినడకన వెళ్తే ఖండాల పిక్నిక్ పాయింట్ వస్తుంది.

### గలగలపారే జలధార 'కుంటాల'

ప్రకృతి ప్రసాదించిన కుంటాల జలపాతం తెలంగాణలోనే ఎత్తైనది. గలగలపారే ఆ జలధార వద్ద నగరం నిద్రపోతున్న వేళ, రుద్రమదేవి వంటి సినిమాల సన్నివేశాలు, పాటలను చిత్రీకరించారు. జలపాతం సమీపంలో విశ్రాంతి భవనం ఉంది. దీన్ని ముందస్తుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడే చిన్న హోటళ్లు ఉన్నాయి. సందర్శకుల కోసం చిన్న గుడారాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 62 కి.మీ.లు, నేరడిగొండ మండలం నుంచి 12 కి.మీ.ల దూరంలో ఈ కుంటాల జలపాతం ఉంది. జూన్ నుంచి డిసెంబరు వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జలపాతాన్ని వీక్షించవచ్చు.

### మానసికోల్లాసానికి 'పొచ్చెర జలపాతం'

ఆత్మీయ సమ్మేళనాలకు పొచ్చెర జలపాతం వేదికగా మారింది. వర్షాకాలంలో వీటి అందం రెట్టింపవుతుంది. జలపాతం సమీపంలో షెడ్‌ను నిర్మించారు. ఇక్కడ సమావేశాలు, భోజనాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. భోజన సౌకర్యం లేదు. ఎవరికి వారే తమవెంట స్నాక్స్, భోజనం తెచ్చుకుంటారు. మానసికోల్లాసాన్ని పంచుతున్న పొచ్చెర జలపాతం బోథ్ మండల కేంద్రం నుంచి 4 కి.మీ.లు, ఆదిలాబాద్ నుంచి 45 కి.మీ.ల దూరంలో ఉంది.

## బల్దియాలో అవిశ్వాస రాజకీయం

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇటీవల భారాస నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్ ఛైర్మన్ జహీర్ రంజానిపై అవిశ్వాసానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. రెండు మూడు రోజులుగా కౌన్సిలర్ల నుంచి సంతకాల సేకరణ కొనసాగుతోంది. భారాస, భాజపాలతోపాటు కాంగ్రెస్‌లోని కొందరు కౌన్సిలర్లు, ఎంఐఎం కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నిస్తుండటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల రాజకీయాలు మొదలైనా.. ఆదిలాబాద్‌కు వచ్చేసరికి స్తబ్దుగానే ఉంది. ప్రస్తుతం భారాసకు చెందిన మాజీమంత్రి కుమారుడు జోగు ప్రేమేందర్ ఇక్కడ పురపాలక ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. భారాసకు చెందిన కౌన్సిలర్ల సంఖ్యాబలమే ఇక్కడ ఎక్కువగా ఉంది. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరినా భారాసనే పురపాలికలో ఆధిక్యం ప్రదర్శిస్తోంది. భారాసలో ఉన్న పుర వైస్ ఛైర్మన్ జహీర్ రంజాని లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ ప్రస్తుతం అవిశ్వాసాన్ని తెరపైకి తేవడం విశేషం. భారాస, భాజపా కౌన్సిలర్లు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఆయా పార్టీల కీలక నేతల నుంచి సూచనలు వచ్చినట్లు చెబుతున్నారు. అన్ని పార్టీల్లోనూ ఇది కాకరేపుతోంది.

అవిశ్వాస తీర్మానం కోసం ఎంఐఎం మద్దతు సైతం కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ సంబంధీకుడే ముందుకు రావడంతో అదే పార్టీకి చెందిన మరో ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్ల సంతకాలు సైతం సేకరించినట్టు సమాచారం. అందరూ కలిసికట్టుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామనే సంకేతం ఇచ్చేలా పావులు కదుపుతున్నారు. పార్టీ సమావేశాలకు దూరంగా ఉన్న ఇద్దరు కాంగ్రెస్ అసంతృప్త కౌన్సిలర్ల మద్దతు కోసం కూడా చర్చిస్తున్నారు. భారాస నుంచి ఇద్దరు కౌన్సిలర్లు త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనుండటంతో వారు సంతకం చేసేందుకు ఆసక్తి కనబర్చలేదని తెలిసింది. భాజపా కౌన్సిలర్లంతా సంతకం చేశారని ఆ పార్టీవర్గాల సమాచారం. కొన్ని రోజులుగా ఈ కార్యక్రమం చాపకింద నీరులా సాగుతోంది. సోమవారం హడావుడిగా సభ్యుల ఇళ్లకు వెళ్లారు. అవిశ్వాసానికి అవసరమయ్యే సంతకాలు సోమవారం సాయంత్రానికి పూర్తయ్యాయని, ఇంకా ఎక్కువమందే సంతకాలు చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. మంగళవారమే జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేయనున్నట్లు సమాచారం. మరో పక్క తన పదవికి ఎలాంటి ఢోకా లేదని వైస్ ఛైర్మన్ ధీమాగా ఉన్నారని ఆయన సంబంధీకులు చెబుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. పురపాలికలోని కీలక పదవిని చేజార్చుకుంటుందా అనే చర్చ కూడా మొదలైంది.

# నీరు.. చేనుకు చేరేదెలా..?

తాండూరు: జిల్లాలో అతిపెద్దదైన కోట్‌పల్లి జలాశయం నుంచి 9,200 ఎకరాలకు 36.72 కి.మీ. పొడవుతో ఉన్న కుడి, ఎడమ కాలువల నుంచి సాగు నీరు అందాలి. రెండున్నర దశాబ్దాలకు పైగా నిర్వహణ సవ్యంగా లేక కాలువలు, తూములు, సరఫరా వ్యవస్థ దెబ్బతింది. కేవలం 4,000 ఎకరాలకే సాగు నీరు అందుతోంది. జలాశయం మరమ్మతుకు రూ.110 కోట్లు కావాలంటూ నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. నిధులు మంజూరు కాలేదు. జిల్లాలోని జలాశయాల నుంచి ఈ ఏడాది చివరి ఆయకట్టుకు సాగు నీరందే పరిస్థితి కనిపించడంలేదు. తూములు బాగు పడలేదు. కాలువల్లో పూడిక పేరుకు పోయి నీరు పారేందుకు, నిలిచేందుకు వీలు లేకుండా పోయింది. నీటి మళ్లింపు కాలువలు (డిస్ట్రిబ్యూటరీలు) దెబ్బతిన్నాయి. మరమ్మతుల గురించి పట్టించుకునే వారే లేకపోయారు. ప్రస్తుత వర్షాకాలంలో జలాశయాలు నిండగానే సాగుకు నీటిని విడుదల చేసినా చివరి ఆయకట్టు వరకు చేరే పరిస్థితి లేదు. దీనికి సంబంధించి 'పరిశీలనాత్మక' కథనం.

21,027 ఎకరాల్లో సగం ఆయకట్టుకే..

జిల్లాలోని పది జలాశయాల పరిధిలో 21,027 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. కాలువలు, తూములు మరమ్మతుకు గురైన కారణంగా కేవలం సగం ఆయకట్టు కంటే తక్కువ భూములకే నీరందనుంది. మిగిలిన భూముల్లో రైతులు వర్షాధార పంటలైన కందులు, పత్తి, పెసలు, మినుములు, జొన్న వంటివి సాగు చేసేందుకు పొలాలను



సిద్ధం చేస్తున్నారు.

19 ఏళ్లుగా సాగుతున్న శివసాగర్

యాలాల మండలంలో కాకరవేణి నదిని ఆధారం చేసుకుని రూ.11.60 కోట్ల వ్యయంతో చేపడుతున్న శివసాగర్ జలాశయం పనులు 19ఏళ్ల నుంచి సాగుతూనే ఉన్నాయి. అలుగు విస్తరణ పనులు వేసవి కాలం చివర్లో ప్రారంభిస్తారు. వర్షాలు షురూ కాగానే పనులు ఆపి వేయడం ఆనవాయితీగా వస్తోంది. 1,000 ఎకరాలకు సాగు నీరందించేందుకు 5 కిలోమీటర్ల పొడవునా కాలువలు చేపట్టాలి. ఇందుకోసం 26 ఎకరాల భూ సేకరణ జరిగింది. గుత్తేదారు మాత్రం ఇప్పటి వరకు కాలువల నిర్మాణం చేపట్టలేదు.

పట్టించుకునే వారే కరవయ్యారు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండలంలోని లఖ్నాపూర్ రిజర్వాయర్, కాలువల మరమ్మతులకు ఏళ్లుగా ప్రతిపాదనలు వెళ్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ ప్రాజెక్టు మొత్తం లోతు లోతు 18 అడుగులు ఉండగా 2647 ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. ఇందులో కుడి కాల్వ కింద 1132 ఎకరాలు, ఎడమ కాల్వ కింద 1505 ఎకరాలుగా ఉంది. పరిగి,రెండు ప్రధాన కాల్వలు మరమ్మతులకు నోచక పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి నీరు నిలవడంలేదు.

కుల్కచర్ల మండలం అంతారం సమీపంలోని పాటిమీది చెరువు జలాశయం కూడా అధ్వానంగా ఉంది. రెండు కాల్వలు నిరుపయోగంగా మారాయి. మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఏఈ సిద్ధార్థ తెలిపారు. నిధులు కావాలని ప్రతిపాదనలు పంపాం

జలాశయాల కాలువలు, తూముల మరమ్మతుకు నిధులు లేకనే పనులు చేపట్టడం లేదు. ఆయా జలాశయాలకు సంబంధించి ప్రభుత్వానికి రూ.కోట్లల్లోనే నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించాం. వానాకాలంలో జలాశయాలు నీటితో నిండితే ఏ జలాశయం నుంచి ఎంత ఆయకట్టు వరకు నీరందుతుందో అంత మేరకే విడుదల చేస్తాం.- సుందర్, కార్యనిర్వాహక ఇంజినీరు, జిల్లా నీటిపారుదల శాఖ.

# రాలని చినుకు.. సాగని ఎవుసం

జగిత్యాల : వానాకాలం సీజను జూన్ 1 నుంచి మొదలైనా ఉమ్మడి జిల్లాలో వర్షాభావంతో సాగుపనులు ఇప్పటికీ ఆశించినట్లుగా ముందుకుసాగక కర్షకులు కలవరపడుతున్నారు. ఈ సీజన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ శాస్త్రవేత్తలు అంచనా వేసినా కురవాల్సిన వర్షపాతం కన్నా కరీంనగర్ జిల్లాలో 40, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 39, జగిత్యాల జిల్లాలో 35, పెద్దపల్లి జిల్లాలో 48 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని 7 శాతం మండలాలు మినహా 93 శాతం మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది. గత యాసంగిలో ఆయకట్టుకు ముందుగానే ప్రాజెక్టుల నీటిని నిలిపివేయటం, ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి ఎత్తిపోతలు లేకపోవటం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో భూగర్భ జలమట్టం సగటున 4.9 మీటర్లనుంచి 13.2 మీటర్లవరకు పడిపోయి మరోవైపు పంటలసాగుకు ప్రతిబంధకంగా మారింది.

రైతులు ఏప్రిల్, మే మాసాల్లోనే దుక్కులు చేసుకుని ఎరువులు, పూడికమట్టి పొలాల్లోకి తొలుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో జూన్ మొదటి వారం నుంచే పసుపు, మక్కలను విత్తుకోవటం, పత్తివిత్తనాలు నాటడం, జనుము, జీలుగ, పెసర, సోయాబీన్ వంటి పంటల విత్తనాలను విత్తుకోవటాన్ని రైతులు ఆరంభించినా వర్షాల్లేక వేసిన విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేకపోవటం, ఎండల తీవ్రత మళ్లీ పెరగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బావులు, బోర్లలో నీటిలభ్యత ఉన్నరైతులు వరినార్లను పోస్తుండగా మరో పక్షం రోజులు వర్షంలేకుంటే ప్రధానపొలాన్ని దున్నటం కష్టసాధ్యమని పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలం వరి ప్రధాన పంటకాగా స్వర్ణవంటి దీర్ఘకాలిక రకాల వరినార్లకు అదను దాటనుంది. ఉమ్మడి జిల్లాలో అన్నిపంటలసాగు 12 లక్షల ఎకరాలు దాటనుందని అంచనా వేయగా ఇందులో వరి, పత్తి, మక్క, పసుపు ప్రధాన పంటలుగా ఉండనున్నాయి. ఇప్పటివరకు భారీవర్షం నమోదుగాకపోవటంతో భూగర్భ జలమట్టం పెరగకపోగా నేలలోని వేడిమి తగ్గక విత్తనాల మొలకశాతం గణనీయంగా తగ్గనుంది. నాలుగు జిల్లాల్లో ఇప్పటివరకు సాగు విస్తీర్ణం కనీసం 7 శాతానికి కూడా చేరలేకపోవటం ప్రతికూలతను వెల్లడిస్తుండగా ముసురువర్షం కురిస్తేనే వాతావరణం చల్లబడి, భూగర్భ జలమట్టం పెరిగి పైర్లసాగుకు దోహదపడనుంది. మరోవైపు శ్రీరాంసాగర్, మధ్యమానేరు, దిగువమానేరు, ఎల్లంపల్లి తదితర అన్నిప్రాజెక్టుల్లోనూ నీటినిల్వలు కనిష్ఠస్థాయికి చేరి వరద రాకుంటే పంటలకు ఏమాత్రం విడుదల చేయలేని పరిస్థితిలో వరుణుడి విస్తీర్ణం ఆధారపడి ఉంది.

# ఐటీ కారిడార్‌పై రెవెన్యూ నజర్




హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. ప్రైవేటు భూములకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను నిజాం వారసుల నుంచి కొన్నామంటూ తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న వారి నుంచి కాపాడేందుకు కార్యాచరణ రూపొందించారు. 1940 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూములు, ధరణి పోర్టల్‌లో భూముల వివరాలను పరిశీలించనున్నారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని ప్రభుత్వ భూములను చెరబట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే గండిపేట, శేరిలింగంపల్లి మండలాల్లో రూ.వెయ్యికోట్లకు పైగా ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను కొద్దిరోజుల క్రితం స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు మండలాల్లో భూముల ధరలు రూ.కోట్లకు పెరగడం, బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం అవుతుండడంతో ప్రభుత్వ భూములను పరిరక్షించనున్నారు.

కోర్టులు.. ట్రైబ్యునల్ తీర్పులు

ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిలో 90 శాతం మంది కోర్టులు, రంగారెడ్డి జిల్లా ట్రైబ్యునళ్లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ భూముల సర్వే నంబర్లకు అదనంగా ఒకటి, రెండు అంకెలు జోడించి తప్పుడు పత్రాలు సృష్టించి న్యాయం చేయాలంటున్నారు. పాత రికార్డులపై ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లలో కొంతమందికి పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో నిర్ణయాలు తీసుకునేందుకు ఆలస్యమవుతోంది. మరోవైపు ఏళ్లతరబడి తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో కొందరు అక్రమార్కుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని వారికి అనుకూలంగా పత్రాలు తయారు చేస్తున్నారు. దీంతో కోర్టులు, ట్రైబ్యునళ్లలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను క్షుణ్నంగా పరిశీలించాక అధికారులు వాటికి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలను సమర్పించనున్నారు. ఇందుకోసం రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించిన సీనియర్లు, విశ్రాంత అధికారుల సహాయం తీసుకోనున్నారు. డిజిటల్ సర్వేలు, సరిహద్దులు చెరువులను సైతం కొందరు అక్రమారు క్లు పూడ్చేస్తున్నారు. గండిపేట, శేరిలింగంపల్లిలలో ఇప్పటికే నలభైకి పైగా చెరువులను పాక్షికంగా, మరికొన్నింటిని పూర్తిగా ఆక్రమించారు. వీటిని నిరోధించేందుకు వీలుగా రెవెన్యూ అధికారులు డిజిటల్ సర్వేలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ భూముల సరిహద్దులను, ప్రైవేటు భూముల సరిహద్దులను పోల్చేందుకు వీటిని వినియోగించనున్నారు. ఇందుకోసం కొత్త పరికరాలను తీసుకొస్తున్నారు. వీటి వల్ల ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమించిన వెంటనే తెలిసిపోతుంది. వెంటనే ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టడంతో పాటు నిర్మాణాలను కూల్చేయనున్నారు. గతంలో తాఖీదులిచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటుండగా... భవిష్యత్తులో మాత్రం వేగంగా చర్యలు చేపట్టేందుకు నిర్ణయించారు. చట్టపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీనియర్ రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగించడంతో పాటు పోలీసుల సమక్షంలోనే కూల్చివేతలను పూర్తిచేయనున్నామని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

# చెత్త డబ్బా.. శుభ్రం చేసేదెవరబ్బా?



హైదరాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో మంచి మార్కులు పొందాలన్న ఉద్దేశంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం ఏడాదికోసారి నగరంలోని రోడ్లపై చెత్త డబ్బాలను ఏర్పాటు చేస్తోంది. అందుకోసం దాదాపు రూ.3 కోట్లు వెచ్చిస్తోంది. ఏర్పాటు చేశాక నిర్వహణను అధికారులు గాలికొదిలేస్తున్నారు. డబ్బాల్లోని చెత్తను ఎవరు తొలగించాలనే అంశంపై స్పష్టత కొరవడింది. జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థలు నువ్వంటే నువ్వని చెప్పుకొంటూ బాధ్యతను విస్మరిస్తున్నాయి. దాంతో.. అవన్నీ వ్యర్థాలతో నిండిపోయి పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. పాదచారులు అటుగా నడవలేని దుస్థితి నెలకొంది.

అనాథలైన డబ్బాలు..2021, 2022లో మాదిరే 2023లో 2,794 డబ్బాలను జీహెచ్ఎంసీ కొనుగోలు చేసింది. వాటిని ప్రధాన రహదారులకు ఇరువైపులా కాలిబాటలపై ఏర్పాటు చేసింది. అంతవరకు అధికారుల్లో కనిపించిన శ్రద్ధ.. తర్వాత మాయమైంది. వాటిని ఎవరు శుభ్రం చేయాలనే అంశాన్ని నిర్ణయించలేదు. వాణిజ్య కేంద్రాల చెంత, ప్రధాన రహదారులు, వీధుల్లో ఉండే చెత్తను శుభ్రం చేసే బాధ్యత రాంకీ సంస్థకు అప్పగించడంతో.. చెత్త డబ్బాలను ఆ సంస్థ పట్టించుకోవట్లేదు. అలాగని.. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులూ క్రమం తప్పకుండా శుభ్రం చేయట్లేదు.

మొక్కుబడి కార్యక్రమంగా మారి...

పాదచారులు తమ చేతిలోని చిత్తు కాగితాలు, ఇతర వ్యర్థాలను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఈ డబ్బాల్లో వేస్తుంటారు. రెండు, మూడు రోజులకోసారైనా వాటిని శుభ్రం చేస్తుంటే.. ప్రజలు మరింత ఎక్కువగా ఉపయోగించే వీలుంటుంది. పది రోజులు, రెండు వారాలు, నెలకోసారి శుభ్రం చేస్తుండటంతో.. అన్ని రోజులపాటు వ్యర్థాలతో నిండి కనిపిస్తున్నాయి. ఆ క్రమంలో దుర్గంధం వస్తోంది. రద్దీ ప్రాంతాల్లో వాటి పరిసరాల్లో జనం నిలవలేని పరిస్థితి ఉంది. అధికారులు కమీషన్ల కోసం డబ్బాలను కొనుగోలు చేస్తున్నారని, మొక్కుబడిగా వాటిని రోడ్లపై ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

మాంసం వ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యంతో...

హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహార పదార్థాలను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నాయి. మాంసం దుకాణాలు, చేపల మార్కెట్లలోని వ్యర్థాలనూ వారే తీసుకెళ్తున్నారు. ఆ క్రమంలో వాటిని తరలించే వాహనాల వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మూతలేని ట్రాలీల్లో జంతు వ్యర్థాలను నిండుగా పోస్తున్నారు. వాటిలోని రక్తం, ద్రవ వ్యర్థాలు ట్రాలీ నుంచి రోడ్లపై పడుతున్నాయి. తరలించే క్రమంలో రోడ్లన్నీ వాటితో తడిసిపోతున్నాయి. వాసన వ్యాపిస్తోంది. ట్రాలీ వెనుక ప్రయాణించే వాహనదారులు నరకం చూస్తున్నారు. జంతు వ్యర్థాల యాజమాన్యం, తరలింపుపై జీహెచ్ఎంసీ దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కోడ్ మాటున.. కట్టేశారు!

హైదరాబాద్: అసెంబ్లీ.. పార్లమెంట్ ఎన్నికలు వరుసగా రావడంతో కోడ్‌తో ప్రభుత్వ కార్యకలాపాల్లో స్తబ్దత నెలకొంది. ఇదే అదనుగా ఈ 6 నెలల కాలాన్ని అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలకు తెరతీశారు. అనుమతులు లేకుండానే భారీ భవనాలు నిర్మించిన వారు కొందరైతే.. ఇంకొందరు జీప్లస్ 2 నుంచి 5 వరకు అనుమతులు పొంది, అదనంగా 2, 3 అంతస్తులు నిర్మించేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అధికారులతో కలిసి హెచ్ఎండీఏ ఈ అక్రమ నిర్మాణాలపై తాజాగా దృష్టి సారించగా ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి. మణికొండ, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్, శంకర్‌పల్లి జోన్ల పరిధిలో వందల సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలు తుది దశలో ఉన్నట్లు గుర్తించారు. కొందరు వీటిలో చాలావరకు అమ్మేశారు. గతంలోనే ఈ నాలుగు జోన్ల పరిధిలో దాదాపు 600 వరకు అక్రమ భవనాలు గుర్తించారు. ఇందులో బహుళ అంతస్తుల్లో ఉన్న 250 భవనాలను పాక్షికంగా కూల్చారు. వాటికి నిర్మాణదారులు మరమ్మతులు చేయించి పూర్తిచేశారు.

చేయి తడిపితే చాలు...

హెచ్ఎండీఏ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులకు సమాచారమున్నా అడ్డుకట్ట వేయరు. అంతస్తుకు ఇంతని లెక్కకట్టి వాటి వైపు చూడరు. భవనం పూర్తయిన తర్వాత ఫిర్యాదులొస్తే వెళ్లి గోడలకు రంధ్రాలు పెట్టి ప్రహరీ కూలగొట్టి అయిందనిపిస్తున్నారు.

బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయ్..

కొందరు చిన్న బిల్డర్లు నిబంధనలు తుంగలో తొక్కి జీప్లస్ 2, 3 అనుమతులు తీసుకొని ఆరేడు అంతస్తులు నిర్మించి అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా భవనాలకు రిజిస్ట్రేషన్లు కావడం, కొన్ని బ్యాంకులు రుణాలు సైతం మంజూరు చేస్తుండటంతో వినియోగదారులు ఇవన్నీ సక్రమమే అనుకుంటున్నారు. చివరికి కూల్చివేతలు చేపట్టినప్పుడు లబోదిబోమంటున్నారు.

# డీజే సిద్ధార్థ్ కేరాఫ్ కొకైన్

హైదరాబాద్: టీఎస్ న్యాబ్ ఆకస్మిక డ్రగ్స్ తనిఖీల్లో ఇద్దరు వినియోగదారులు పట్టుబడ్డారు. నగరంలోని కొన్ని పబ్బుల్లో డీజేగా పనిచేసే బంజారాహిల్స్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన సిద్ధార్థ్, మాదాపూర్‌కు చెందిన స్వరూప్‌ను అరెస్టు చేశారు. కొన్నాళ్లుగా వీరు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు గుర్తించిన టీఎస్ న్యాబ్ అధికారులు నిరంతరం నిఘా ఉంచారు. డ్రగ్స్ తీసుకున్న అనంతరం మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని పబ్బులకు వెళ్తున్నారు. డీజే సిద్ధార్థతో సహా 16 మంది డ్రగ్స్ వినియోగిస్తూ తరచూ పబ్బులకు వెళ్తున్నట్లు గుర్తించారు. వీరి కదలికల్ని గమనిస్తూ వచ్చిన అధికారులు వీరందర్నీ వేర్వేరు పబ్బుల దగ్గర అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక కిట్ ద్వారా వీరి మూత్ర నమూనాలను పరిశీలించగా సిద్ధార్థ్, స్వరూప్ ఇద్దరూ కొకైన్, క్యానబిస్ తీసుకున్నట్లు తేలింది. వీరిద్దరినీ మాదాపూర్ ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఓ ప్రకటనలో తెలిపారు. డ్రగ్స్ సరఫరాదారులు నిరంతరం పోలీసు నిఘాలో ఉంటారని, వారికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, అగ్రశ్రేణి సంస్థల్లో మాదకద్రవ్యాలను అడ్డుకోవడానికి



గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే ఫోన్ 8712671111కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

# దోమలను ఎదుర్కొనేందుకు సిద్ధమేనా?

కరీంనగర్ : జిల్లాలోనూ ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో అధ్వానంగా తయారయ్యాయి. ఒక్క వర్షం పడితే చాలు అవి కుంటలుగా మారుతాయి. మురుగునీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఏర్పడనుంది. వ్యాధులు ముసురుకునే అవకాశం ఉండగా ఆ స్థల యజమానులు మాత్రం పట్టనట్లుగా ఉంటున్నారు. పురపాలికలు, నగరపాలికలు మాత్రం ఫిర్యాదులు వచ్చిన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలపై 'న్యూస్‌టుడే' కథనం..

జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, కొత్తపల్లి పురపాలికల పరిధిలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇప్పటికే చెత్తా చెదారంతో నిండి పోగా వాటిని ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాల్సిన యజమానులు పట్టించుకోవడం లేదు. పైగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లపై ఒత్తిడి తీసుకొచ్చి బల్దియా కార్మికులతో చెత్తను శుభ్రం చేయిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు సైతం రాజకీయ ఒత్తిళ్లతో ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. నగరంలో మూడు వేలకు పైగా..

నగరంలో మూడు వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉండగా అవన్నీ దుర్గంధభరితంగా ఉన్నాయి. అలకాపురికాలనీ, ఆదర్శనగర్, సుభాష్‌నగర్, కిసాన్‌నగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఖాన్‌పుర, దుర్గమ్మగడ్డ, హుస్సేనీపుర, అశోక్‌నగర్, లక్ష్మీనగర్, గాయత్రీనగర్, పోచమ్మవాడ, వావిలాలపల్లి, బ్యాంకుకాలనీ, కుర్మవాడ, సంతోష్‌నగర్, భగత్‌నగర్, కట్టరాంపూర్, కోతిరాంపూర్, గణేశ్‌నగర్ బైపాసు, తిరుమల్‌నగర్, విద్యానగర్, రాంనగర్, సప్తగిరికాలనీ, కొత్తయాస్వాడ, రేకుర్తి, హనుమాన్‌నగర్, రాంచంద్రాపూర్, వాసుదేవకాలనీ, టీఎన్‌జీవోఎస్ కాలనీ, అగ్రికల్చర్ కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంతాల్లో వర్షాలకు నీరు నిలుస్తోంది. చిన్నపాటి చెరువులను తలపిస్తాయి.

హెచ్చరిక బోర్డులకే పరిమితం.. : ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని ఆయా స్థలాల ఎదుట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా స్థల యజమానులు మాత్రం పట్టించుకోవడం లేదు. వారం రోజుల్లో శుభ్రం చేసి తెలపాలని, లేదంటే రూ.10 వేల జరిమానా వేస్తామని గతంలో బోర్డులు పాతినా పెడచెవిన పెట్టారు. ఇప్పటి వరకు నగరపాలక సంస్థ నయాపైసా జరిమానా విధించకపోవడంతో, స్థల యజమానులు కూడా పట్టింపులేని ధోరణిలో ఉన్నారు.

తెలంగాణ పురపాలిక చట్టం-2019 సెక్షన్ 161(1)ప్రకారం చర్యలు తీసుకునే వీలున్నా అధికారులు కదలడం లేదు. ఈ స్థలాలు విక్రయిస్తే రెట్టింపు లాభం వస్తుండగా కనీసం శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచన మాత్రం చేయడం లేదు. హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా మంత్రి హెచ్చరిస్తే తప్ప అవి శుభ్రం చేసుకునేలా కనిపించడం లేదు. పైగా వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. పురపాలికలు, నగరపాలికలు, గ్రామ పంచాయతీల్లో సీజన్ ప్రారంభంలో బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకొంటారు. నీరు నిల్వ ఉన్న చోట వైద్యారోగ్య శాఖ సరఫరా చేసి గంబూసియా చేపలు వదులుతారు. ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ఒక్కో కాలనీకి 15 రోజులకు ఒకసారి మాత్రమే వస్తాయి.

మార్పు వస్తేనే..దోమల కారణంగా పిల్లల నుంచి మొదలుకుంటే వృద్ధుల వరకు జ్వరాల బారినపడతారు. ఒక్కోసారి ఇంటిల్లిపాదీ జ్వరబాధితులుగా ఉంటుంటారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, మురుగు కుంటలు, వర్షంనీరు నిల్వ ఉండటం.. ఇవన్నీ దోమల ఆవాసాలు.. ఎవరి ఇళ్లు వారే అని కాకుండా.. కాలనీవాసులు సమష్టి నిర్ణయం తీసుకొని ఖాళీ స్థలాలు శుభ్రం చేయిస్తే.. వాటి పెరుగుదల తగ్గుతుంది. అందరిలో చైతన్యం వస్తేనే వాటి నివారణ సాధ్యమవుతుంది.

నోటీసులు జారీ చేస్తాంఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉన్నట్లయితే గుర్తించి నోటీసులు జారీ చేసేలా ఆదేశాలిస్తాం. స్థల యజమానులు వాటిని శుభ్రంగా ఉంచుకోవాలి. వర్షం నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. - బి.శ్రీనివాస్, కమిషనర్, కరీంనగర్

# డీసీసీబీ ఏర్పాటులో జాప్యం

జగిత్యాల : కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలను కొత్త జిల్లాలకు విస్తరించేలా రెండేళ్ల కిందట ఏర్పాటుచేయ తలపెట్టిన ప్రాంతీయ కార్యాలయాలను కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా నెలకొల్పాల్సి ఉంది. ముందుగా ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటుచేసి తర్వాత కొత్త జిల్లాలవారీగా డీసీసీబీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు జిల్లా నుంచి కొందరు ప్యాక్స్‌ల అధ్యక్షులకు కరీంనగర్ డీసీసీబీలో సభ్యులుగా అవకాశం ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 15 బ్యాంకు శాఖలు పనిచేస్తుండగా జగిత్యాలలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి రైతులు, సహకార సంఘాలకు సేవలను మరింతగా దరిచేర్చాలన్న నిర్ణయాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేసిన అనంతరం కొన్ని మాసాల్లో ప్యాక్స్‌లకు ఎన్నికలు జరిగిన అనంతరం డీసీసీబీలను కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు చేసినట్లయితే జిల్లాకు చెందిన ప్యాక్స్‌ల అధ్యక్షులతోనే డీసీసీబీ కార్యవర్గం ఏర్పాటవుతుంది. ప్రస్తుతం కరీంనగర్ డీసీసీబీ పరిధిలో జగిత్యాలలో బ్యాంకు ఉండగా దాని ఆవరణలోనే పాత భవనం కూడా ఉంది. ప్రస్తుతం డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటుచేసే వీలుంది, తదుపరి డీసీసీబీ ఏర్పాటుకు కూడా అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. డీసీసీబీ పరిధిలో ప్రస్తుతం రైతులకు పంట రుణాలు, టర్మ్ రుణాలు, దీర్ఘకాలిక, వ్యాపార రుణాలను ఇస్తుండగా చాలావాటికి కరీంనగర్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి అనుమతి పొందాల్సివచ్చేది. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుతో సేవలన్నీ ఇక్కడే లభిస్తాయి.

కేంద్ర ప్రభుత్వం అయిదేళ్లలో 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికో ప్యాక్స్ ఉండాలని తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోనూ ప్యాక్స్‌ల సంఖ్య పెరగనుంది. ప్యాక్స్‌ల ద్వారా 25 రకాల సేవలను అందించాలని కేంద్రం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే 51 ప్యాక్స్‌లుండగా 385 గ్రామపంచాయతీల్లో కనీసం మరో 50 గ్రామాల్లో నూతనంగా ప్యాక్స్‌లను ఏర్పాటుచేసే వీలుండటం కర్షకులకు కలిసిరానుంది. డీసీసీబీ పరిధిలో ఖాతాదారులు, సేవలు పెరిగినట్లయితే నాబార్డు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు కూడా రైతులు, సహకార సంఘాలకు సులువుగా అందుతాయి. అన్నిసంఘాల పరిధిలో ధాన్యం, మక్కలను కొనుగోలు చేస్తుండగా జగిత్యాల, రాయికల్ తదితర సంఘాలు కేంద్ర ఎరువుల సంస్థ క్రిభ్‌కోలో రూ.50 లక్షల చొప్పున వాటాధనం చెల్లించి సాలీనా రూ.10 లక్షల డివిడెండ్‌ను పొందుతున్నాయి. చాలాసంఘాలు రుణాల మంజూరీ, బ్యాంకింగ్ కౌంటర్లు, లాకర్లు, పెట్రోలు పంపులను నిర్వహిస్తుండగా విత్తనశుద్ధి ప్లాంట్లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాయి. నాబార్డు ద్వారా పలుసంఘాలకు రూ.20 లక్షల చొప్పున నిధులను అందించగా గోదాములను నిర్మించారు. ఈ నేపథ్యంలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు, ప్యాక్స్ కేంద్రాల సంఖ్యపెంపు, రైతులందరినీ సభ్యులుగా చేర్పించటం దీర్ఘకాలికంగా ఉపయుక్తంగా ఉండనుంది.




## రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలిగిన మోదీ పేపర్ లీకేజీని ఆపలేకపోయారన్న రాహుల్

నీట్ పరీక్షల్లో అవకతవకలపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నీట్ పేపర్ వివాదంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ టార్గెట్ చేసింది. కేంద్రప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలను ఆపడం ప్రధాని మోదీకి ఇష్టం లేనట్లు కనిపిస్తోందన్నారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ ఆపారని చెప్పుకుంటారని.. దేశంలో పేపర్ లీకేజీలను మాత్రం ఆయన ఆపలేకపోతున్నారని రాహుల్ విమర్శించారు. విద్యావ్యవస్థలో బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ చొరబడిన కారణంగానే పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యావ్యవస్థపై ఆర్ఎస్ఎస్ పెత్తనం పోయినప్పుడే పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన ప్రధాని మోదీ.. పేపర్ లీకేజీలతో విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో అర్హత లేని వీసీలను బీజేపీ మాతృసంస్థ సిఫార్సులతో నియమించిన కారణంగానే పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు.

**రేపు దేశవ్యాప్తంగా నిరసనలు..** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై శుక్రవారం దేశ వ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. విద్యార్థులకు న్యాయం చేయాలంటూ నిరసనలు నిర్వహించాలని వివిధ రాష్ట్రాల్లోని పార్టీ శాఖలను ఆదేశించింది. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, సీనియర్ నాయకులు పాల్గొంటారన్నారు.




## పట్టపగలే రెచ్చిపోయిన మరో అంతర్రాష్ట్ర ముఠా..

హైదరాబాద్: మేడ్చల్‌లో మరో అంతర్రాష్ట్ర ముఠా రెచ్చిపోయింది. బంగారం దుకాణంలోకి ప్రవేశించిన ఇద్దరు దుండగులు యజమానిపై కత్తితో దాడి చేసి నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

**దాడి జరిగిందిలా..** మేడ్చల్‌లో ఇవాళ(గురువారం) మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై మహిళల వేషంలో బురఖా ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు జగదాంబ జ్యువెల్లరీస్ షాపులోకి ప్రవేశించారు. హెల్మెట్ ధరించి ఉన్న ఇద్దరి దుండగుల్లో ఒకరు వెంటనే కత్తితో యజమాని గుండెలపై పొడిచాడు. బాధితుడు భయభ్రాంతులకు గురికావడంతో అతడి వద్ద నుంచి నగదు దోచుకున్నారు.

భయంతో యజమాని శేషరం బయటకు పరుగులు తీసి గట్టిగా కేకలు వేశాడు. దీంతో ఇంట్లో నుంచి వచ్చిన ఆయన కుమారుడు.. వారిపై కుర్చీ విసిరివేశాడు. స్థానికులు వస్తారన్న భయంతో బంగారం దోచుకోకుండానే దుండగులు వెంటనే అక్కడ్నుంచి ద్విచక్రవాహనంపై పరారయ్యారు. షాపు యజమాని శేషరంకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుల సమాచారం అందుకున్న పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. మేడ్చల్ పరిసరాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

**ఇప్పటికే రెచ్చిపోతున్న భవారియా గ్యాంగ్, ధార్ గ్యాంగ్‌లు..** ఇప్పటికే హైదరాబాద్ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర ముఠాలు భవారియా గ్యాంగ్, ధార్ గ్యాంగ్‌లు రెచ్చిపోతున్నాయి. తాజాగా మరో గ్యాంగ్ రావడంతో నగరవాసులు హడలిపోతున్నారు. ఇప్పటికే భవారియా గ్యాంగ్ ముఠా సభ్యులు చోరీ చేసిన ద్విచక్రవాహనాలపై మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు.

వీరంతా ఉత్తరప్రదేశ్ షామ్లి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. అయితే మేడ్చల్‌లో దాడికి పాల్పడింది మరో కొత్త గ్యాంగ్‌గా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు వరస దాడులతో బెంబేలెత్తుతున్నారు. పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ సోదాలు.. అసలు కారణం అదే..!

తెలంగాణలో ఈడీ సోదాలు మరోసారి కలకలం రేపుతున్నాయి. ఎన్నికల ముందు వరకు ఐటీ, ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం వేడెక్కిన విషయం తెలిసిందే. ఎన్నికలు పూర్తైన తర్వాత కూడా ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం ఆసక్తిరేపుతోంది. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ఈడీ అధికారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంట్లో కూడా ఏక కాలంలో తనిఖీలు చేపట్టారు. ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గూడెం మహిపాల్ రెడ్డి సోదరులు ఇద్దరు మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఓ కేసులో మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధు అరెస్ట్ కాగా ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు.

**నిజాంపేటలో..** హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అల్లుడి ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేస్తున్నారు.

గతంలో లక్డారం గనుల వ్యవహారంలో వీరిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సోదాల సమయంలో గూడెం మహిపాల్ రెడ్డి సోదరుల ఇళ్ల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు మహిపాల్ రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు కేంద్రబలగాలతో భద్రత ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా మహిపాల్ రెడ్డి అల్లుడు తాజాగా రూ.3కోట్ల ఖరీదైన విలాసవంతమైన కారు కొన్నట్లు సమాచారం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## దశలవారీగా రైతు రుణమాఫీ అమలు!

వచ్చే నెల మొదటి వారం నుంచి రైతు రుణమాఫీని దశలవారీగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

అమలుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు, నిధుల సమీకరణ తదితర అంశాలపై ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 15 కల్లా రుణమాఫీని అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గత కొన్ని రోజులుగా ఆర్థిక శాఖ అధికారులతోనూ, మంత్రివర్గ సహచరులతోనూ దీనిపై విస్తృతంగా చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూపొందించిన మార్గదర్శకాలను కూడా అధ్యయనం చేసిన ప్రభుత్వం, రుణమాఫీ అమలులో కేంద్ర మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## సింగరేణి విషయంలో కుట్ర జరుగుతోంది: కేటీఆర్



హైదరాబాద్: సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా.. ఉద్దేశ పూర్వకంగా కుట్ర జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “ 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మకంగా ఉంటామని కేసీఆర్ చెబితే.. వాటితో ఏం చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 16 ఎంపీ సీట్లు వచ్చిన తెదేపా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో భాజపా, కాంగ్రెస్‌కు చెరో 8 సీట్లు ఉన్నాయి. బొగ్గు గనుల వేలం పెట్టవద్దని గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఒడిశాలో రెండు గనులను వేలం లేకుండా నైవేలీ లిగ్నైట్‌కు అప్పగించారు. అలాగే గుజరాత్‌లో రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు 2015లో వేలం లేకుండానే నేరుగా నాలుగు గనులు కేటాయించారు. తమిళనాడులో కూడా బొగ్గు గనులను వేలం నుంచి మినహాయించాలని ఆ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రిని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్లే నష్టాల్లోకి వెళ్లింది. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్ల అనే గనిని క్యాప్టివ్ మైన్ కింద కేటాయించాలని వైజాగ్ స్టీల్ ప్లాంట్ అడిగితే కేంద్రం ఇవ్వలేదు. ఆక్షన్‌లో అదానీకి అప్పగించింది.

సొంత గనిలేకపోవడంతో నష్టాల్లోకి వెళ్లిన విశాఖ ఉక్కును అమ్మాలని చూశారు. ఇప్పుడు సింగరేణి విషయంలో కూడా అదే విధమైన వ్యూహం అలవంబించబోతున్నారు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్ర ఇది. 2021 డిసెంబరు 11 నాడు సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి వైఖరి ఎందుకు మారింది? వేలంలో పాల్గొంటామని ఇప్పుడు చెబుతున్నారు. తెలంగాణలోని బొగ్గు గనులు వేలం వేయకుండా ఇప్పటి వరకు భారాస రక్షణ కవచంలా నిలిచింది” అని కేటీఆర్ అన్నారు.

## అతి త్వరలోనే జాబ్ క్యాలెండర్




హైదరాబాద్: అతి త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని దుద్దిళ్ల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ధర్నా చౌక్‌లో విద్యార్థుల ధర్నాపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. త్వరలోనే గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాల ఖాళీలను గుర్తించి అతి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చారు. కొందరు విద్యార్థులు, నిరుద్యోగ మిత్రులు ఈరోజు ధర్నా చేస్తున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో లీగల్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నిపుణులతో చర్చిస్తున్నామని అన్నారు. జీవో 46 బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## పర్యాటక భవన్ అధికారులపై ఆగ్రహించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్: హిమాయత్ నగర్ పర్యాటక భవన్‌ను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు పట్టిక, బయోమెట్రిక్ అటెండెన్స్ పరిశీలించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోవడం, హాజరు శాతం తక్కువగా ఉండటంపై మంత్రి ఆగ్రహించారు.

ప్రతీ ఫ్లోర్ తిరిగి ఉద్యోగులు, సిబ్బంది వివరాల్న అడిగి తెలుసుకున్నారు. ఖాళీ కుర్చీలే ఎక్కువగా దర్శనం ఇవ్వడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సంవత్సర కాలానికి సంబంధించిన అటెండెన్స్ జాబితా తయారు చేయాలని వెంటనే ఆదేశించారు. హాజరుశాతం, ఉద్యోగులు పనితీరుపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. ఉన్నతాధికాల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకూ



బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సుస్పష్టం చేశారు.

## మాకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది



మెదక్: బక్రీద్‌కు రెండు రోజుల ముందు మెదక్‌లో చోటుచేసుకున్న అల్లర్లు పోలీసుల వైఫల్యంతోనే అని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ అల్లర్లలో అరెస్టు అయిన బీజేపీ నేతల బెయిల్ పిటిషన్ ఈరోజు(గురువారం) దాఖలు చేశారు. వారి తరపున మెదక్ జిల్లా న్యాయస్థానంలో ఎంపీ, న్యాయవాది రఘునందన్ రావు వాదించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ... పోలీసుల వైఫల్యాలను కోర్టు పెద్దలకు వివరించామని చెప్పారు. పిటిషన్ ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే మెదక్‌లో అల్లర్లు జరిగేవి కావని తెలిపారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ 21 కి వాయిదా వేశారన్నారు. కార్యకర్తలకు కష్టమొస్తే అక్కడ రఘునందన్ ఉంటాడని అన్నారు. ఎంపీలకు సన్మానం ఉన్నా ..కార్యకర్తలకంటే ఎక్కువ సన్మానాలు కాదని ఇక్కడికి వచ్చానని అన్నారు. కార్యకర్తల కష్టంతోనే మెదక్ ఎంపీగా గెలిచానని తెలిపారు. వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన గ్రూప్ 1 అభ్యర్థులు



కరీంనగర్: కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను గ్రూప్-1 అభ్యర్థులు కలిశారు. గ్రూప్-1 మెయిన్స్ కోసం ప్రిలిమ్స్ నుంచి 1:100 చొప్పున ఎంపిక చేసేలా చూడాలని నిరుద్యోగులు కోరారు. నాలుగేళ్లలో మూడు సార్లు గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని నిరుద్యోగులు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని సైతం నిరుద్యోగులు గుర్తు చేశారు. గ్రూప్ 1 పోస్టులు అత్యధికంగా ఉండటంవల్ల 1: 50 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేస్తే నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని బండి సంజయ్ వారికి హామీ ఇచ్చారు. తెలంగాణలో గత ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలోనే గ్రూప్-1 ప్రిలిమ్స్ జూన్ 9వ తేదీన నిర్వహించి.. దీనికి సంబంధించిన ప్రాథమిక కీ, మాస్టర్ ప్రశ్నపత్రం కూడా రిలీజ్ చేయడం జరిగింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660